# సాక్షి చిత్తూరు

బుధవారం, 10, మే, 2023






**వేషాల వేడుక**

వేషాల వేడుకకు సర్వం సిద్ధమైంది. తిరుపతి తాతయ్యగుంట గంగజాతరకు చాటింపు ప్రక్రియ పూర్తి అయ్యింది. -8లో



**చిత్తూరులో భూ మాయగాళ్లు**

చిత్తూరులో భూ మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులను టార్గెట్ చేస్తూ..భూ దందాలకు పాల్పడుతున్నారు. -8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 38 | 25 |
| తిరుపతి | 39 | 26 |
| తిరుమల | 34 | 21 |
| గూడూరు | 39 | 27 |
| నగరి | 40 | 26 |

## న్యూస్‌రీల్

### చిత్తూరు గంగజాతరకు చాటింపు



చాటింపు పూజలు చేస్తున్న జాతర నిర్వాహకులు

**చిత్తూరు రూరల్:** ఈనెల 16, 17 తేదీల్లో జరిగే చిత్తూరు నడివీధి గంగజాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. ఆనవాయితీ ప్రకారం తొలుత చెంగల్వరాయ కొండ ప్రాంతంలో ఉన్న ఎల్లమ్మ దేవత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు సతీమణి సీకేలావణ్య పూజలు చేసి చాటింపు ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం గెరిగెతో ఊరేగింపుగా చాటింపు వేశారు. ఈక్రమంలో ఊరు పొలిమేర్లలో పూజలు చేసి..చాటింపు వేశారు. ప్రజలు అడుగడుగునా గెరిగెకు కర్పూర హారతులు సమర్పించారు. తదనంతరం నడివీధిలో అమ్మవారిని ప్రతిష్టించే చోట ప్రత్యేక పూజలు చేసి జాతర చాటింపు ప్రక్రియను పూర్తి చేశారు.

### మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో చేరేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. www.cse.ap.gov. in/apms.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సమీపంలోని మోడల్ స్కూళ్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

### ముగిసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న యాజమాన్యం

**గంగవరం:** మదర్‌థెరిసా కళాశాలలో మూడు రోజులు క్రికెట్ ప్రీమియర్ లీగ్ మంగళవారం ముగిసింది. మూడవ రోజు ఎనిమిది జట్లు పోటీ పడగా, బాయ్స్ ఆఫ్ బాలు అండ్ మదర్‌థెరిసా పలమనేరు జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. శ్రీచైతన్య కళాశాల మదనపల్లె జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలతో పాటు షీల్డ్‌ను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ అందజేశారు.

### ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో పాలిసెట్

**తిరుపతి ఎడ్యుకేషన్ :** పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం తిరుపతిలోని 8 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్–2023 పరీక్షను నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 958 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరుకానున్నారని, వీరికి 4981001 నుంచి 4981958 వరకు హాల్‌టికెట్లను సాంకేతిక విద్యాశాఖ కేటాయించినట్లు తెలిపారు. అయితే ఈ హాల్‌టికెట్లలో పరీక్షా కేంద్రం పేరును 'ఎస్వీ ఆర్ట్స్ కళాశాల' బదులుగా 'ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల'గా ముద్రించారని, విద్యార్థులు దీనిని గుర్తించి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### శ్రీవారి దర్శనానికి 10 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,904 మంది స్వామివారిని దర్శించుకోగా.. 29,290 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.57 కోట్లు లభించాయి. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టోకెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### పదో రోజుకు చేరిన స్వచ్ఛ యజ్ఞం

**తిరుమల :** టీటీడీ ఉద్యోగులు స్వచ్ఛందంగా చేపడుతున్న 'సుందర తిరుమల– శుద్ధ తిరుమల' యజ్ఞం మంగళవారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తిరుమల ఆస్థాన మండపంలో ఉద్యోగులను ఉద్దేశించి ఈఓ ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించిన విపత్కర సమయంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా పరిశుభ్రంగా ఉంచుకోవడం హర్షణీయమన్నారు. అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు క్రమశిక్షణతో పాల్గొంటున్నారని కొనియాడారు.


జిల్లాలో నాణ్యమైన మామిడి దిగుబడికి ఉద్యానవన అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. నాణ్యమైన పంట దిగుబడి రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ ఏడు విపత్తులు ఎదురైనా మామిడి సాగు దిగుబడి ఆశాజనకంగానే ఉంది. సుమారు 5,86,563 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. సుమారు 300 టన్నుల వరకు విదేశాలకు ఎగుమతి లక్ష్యంగానే నిర్ణయించారు. ప్రారంభ దశలో ఇప్పటి వరకు సుమారు 10 టన్నులు ఎగుమతి చేశారు. మరికొన్ని టన్నులు రవాణా దశలో ఉన్నాయి.

# ఆశాజనకం.. మధురఫలం



మామిడి మండీలో వ్యాపారుల సందడి(ఫైల్)

- సేంద్రియ సాగుతో నాణ్యతతో దిగుబడి
- ఫలించిన అధికారుల ప్రణాళికలు
- ఉమ్మడి జిల్లాలో 300 టన్నుల విదేశీ ఎగుమతి లక్ష్యం
- 1.08 లక్షల ఎకరాల్లో పంట..5.86 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- చిత్తూరు జిల్లాలో మాత్రమే 68,479 హెక్టార్లల్లో సాగు
- మొదటిరకం పంట విదేశాల ఎగుమతి
- ఢిల్లీ, కోల్‌కత్తా, మహారాష్ట్రకు ఎగుమతి



**సాక్షి, చిత్తూరు:** జిల్లాలో దిగుబడి అయ్యే మామిడికి అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉంది. జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యల నేపథ్యంలో సేంద్రియ సాగును ప్రోత్సహించడంతో నాణ్యమైన పంట దిగుబడి వచ్చింది. సీజన్ ప్రారంభం కాకముందు నుండే మామిడి పంటపై జిల్లా ఉద్యానవనశాఖ రైతులకు విస్తృత అవగాహన కల్పించడంతో మంచి దిగుబడి వచ్చింది. నాణ్యమైన ఉత్పత్తులు కారణంగా విదేశాలకు ఎగుమతులు చేయడానికి వీలుంటుందనే భావన రైతులకు అర్థమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1,08,428 లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. సుమారు 5,86,563 మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో తోతాపురి రకం 4 లక్షల టన్నులు, బెనీషా 29000 టన్నులు, నీలం 42వేల టన్నులు, మల్లిక, కాలేపాడు, హిమామ్ పసంద్, పులిహోర, జవేరి వంటి రకాల పంటలు 15,000 టన్నులు దిగుబడి అంచనా వేశారు. ఆమేరకు దిగుబడి వస్తోంది.

**34 గుజ్జు పరిశ్రమలు**

ఉమ్మడి జిల్లాలో 34 గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల ద్వారా ఉత్పత్తి అయిన గుజ్జు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తోతాపురిరకం మామిడి మొత్తం గుజ్జు పరిశ్రమలకే ఉపయోగిస్తారు. ఈ గుజ్జు జిల్లాలో 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఇతర ప్రాంతాల వారు కూడా పండ్లను ఇక్కడి పరిశ్రమల్లో గుజ్జు తయారు చేసుకుని, ఇతర దేశాలకు విక్రయిస్తుంటారు.

**జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..**

చిత్తూరు జిల్లాలో మామిడినే ప్రాధాన్యత పంటగా సాగుచేస్తారు. ఇక్కడి పండించే మామిడికి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉంది. జిల్లా నుంచి ఢిల్లీ, కలకత్తా, మహారాష్ట్ర, అస్సాం, కర్నాటక, తమిళనాడుకు అత్యధికంగా ఎగుమతి అవుతోంది. కొన్ని గల్ఫ్ దేశాలు, జపాన్, న్యూజిలాండ్, నెదర్లాండ్, దక్షిణ కొరియాతోపాటు మరికొన్ని యూరప్ దేశాలకు ఎక్కువస్థాయిలో మేలిమి రకానికి చెందిన మామిడి ఎగుమతి చేస్తుంటారు. ఈ ఏడాది కూడా సుమారు 300 టన్నుల వరకు ఎగుమతి చేయాలని లక్ష్యంగానే నిర్దేశించుకున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సుమారు 10 టన్నులు ఎగుమతి చేశారు. మరికొన్ని టన్నులు రవాణా దశలో ఉన్నాయి.



**ఈ సంవత్సరం విరగ్గాసిన మామిడి**

జిల్లాలోని 22 మండలాల్లో మామిడి సాగు ప్రధానంగా ఉంది. మొత్తం 13 లక్షల ఎకరాల భూమి ఉండగా మామిడి పంట 68 వేల హెక్టార్లలో సాగువుతోంది. ఇందులో 46,566 హెక్టార్లలో తోతాపురి రకం పంటే మొదటి స్థానం పంటగా కొనసాగుతోంది. ఇక 10,275 హెక్టార్లలో బెనీషా(బంగినపల్లి), 6,755 హెక్టార్లలో నీలం, 4,883 హెక్టార్లలో మల్లిక, కాలేపాడు, హిమామ్‌పసంద్, పులిహోర, జవేరి రకాలు సాగు చేస్తున్నారు. చిత్తూరు, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, బంగారుపాలెం, పలమనేరు, పుంగనూరు, గుడిపాల, యాదమరి, ,పెనుమూరు, గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల, చౌడేపల్లె, పెద్దపంజాణి, వీ.కోట, రామకుప్పం, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో ఎక్కువగా సాగువుతోంది. మార్కెటింగ్ సౌకర్యాలు ప్రధానంగా దామలచెరువులోని మ్యాంగో నగర్, చిత్తూరు, బంగారుపాలెం, పుత్తూరు, పలమనేరు ప్రాంతంలో ఉన్నా యి.

**అవగాహనతో పంట దిగుబడి**

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడి వస్తుంది. అలాంటి పంటకే దేశీయంగా, అంతర్జాతీయంగాను డిమాండ్ ఉంటోంది. సేంద్రియ సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు. అధికారుల ముందస్తు అవగాహన చర్యలతో రైతుల్లో చైతన్యం వచ్చింది. సేంద్రియ ఎరువులను వాడడడంతో నాణ్యమైన ఉత్పత్తులు వచ్చాయి, పెట్టుబడి ఖర్చు కూడా బాగా తగ్గింది.రైతు కళ్లలో ఆనందం కనబడుతోంది.

– కిషోర్‌కుమార్‌రెడ్డి, రైతు, మండీ యజమాని, అరగొండ

**అవగాహన పెంచాం**



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హెక్టార్ తోటల నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. జూలై నుంచి నవంబరు వరకు యాజమాన్య పద్ధతులు చేపట్టడంతో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. కొంతమేర విపత్తులు వచ్చినా పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తమశాఖ నాణ్యమైన దిగుబడి కోసం అన్ని ప్రయత్నాలు చేసింది. రైతులు సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా ఖర్చులను తగ్గించుకుని, నాణ్యమైన దిగుబడి సాధించారు. దీంతో విదేశాలకు ఎగుమతి చేయడం సులువుగా ఉంది. అందుకోసం రైతులకు జిల్లా యంత్రాంగం సంపూర్ణంగా సహకరిస్తోంది.

–మధుసూదన రెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

## ప్రజలకు మరింత చేరువగా పాలన



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు
- పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజలకు మరింత చేరువగా పాలన సాగించేందుకే 'జగననన్నకు చెబతాం' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో 'జగనన్నకు చెబుతాం' జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో తాడేపల్లెలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం కార్యక్రమాన్ని ప్రారంభించి, జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడారు. అనంతరం జిల్లా స్థాయి కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రజలు 1902కు కాల్ చేసి ఎలాంటి సమస్యనైనా చెప్పవచ్చని తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు పరిపాలనను చేరువ చేసిందన్నారు. జగనన్న చెబుతాం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తూ పారదర్శక సేవలు అందించాలని కోరారు.

**స్పందనకు మరింత మెరుగు**

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రతి సోమవారం వారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నమోదైన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో అధికారులు పరిశీలించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్పందనను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ అముద, డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజియన్ ఆర్గనైజర్ శైలజారెడ్డి, జిల్లాలోని డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడ్కో గృహాల సదుపాయాలపై నివేదిక

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులకు కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో టిడ్కో గృహాల మౌలిక సదుపాయాలపై వెంటనే నివేదికలను పంపాలని అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా అంచనా వేయని ఆస్తులు ఉన్నాయన్నారు. వాటిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. మూడు వేల స్థలాలకు సంబంధించి అసెస్మెంట్ జరగలేదని, ఆ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, మెప్మా పీడీ రాధమ్మ, చిత్తూరు నగరపాలిక కమిషనర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలి**

పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఇంటర్మీడియెట్ తర్వాత విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ టెక్‌బీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్యత కళాశాలల్లో శిక్షణ పొందిన వారికి ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. అందుకు తగిన జాబ్ క్యాలెండర్‌ను రూపొందించాలని పరిశ్రమల అధికారిని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఈ సమీక్షలో ట్రైనింగ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్డీఏ పీడీ తులసి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జేడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు ద్రోహి చంద్రబాబు

- అన్నదాతలపై లాఠీచార్జి చేయించిన నీచ చరిత్ర బాబుది
- రైతుల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

**గంగాధరనెల్లూరు(కార్వేటినగరం):** అధికారం కోసం మాయ మాటలతో దగా చేసి రైతు ద్రోహిగా చంద్రబాబు ఖ్యాతి కెక్కారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆరోపించారు. మంగళవారం నల్లెపల్లి పంచాయతీ మిట్టపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు రైతుల అభ్యున్నతిని ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. గతంలో గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతన్నలు ధర్నాలు చేస్తే పోలీసులతో లాఠీచార్జీ చేయించిన నీచమైన చరిత్ర చంద్రబాబు నాయుడుదని, నేడు జగనన్న పాలనలో రైతు అన్ని విధాలా ఆనందంగా ఉన్నాడని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారని, స్థానికంగానే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చారని, అధికారులు ఆర్బీకేల్లోనే ఉంటూ సాగుకు అవసరమైన అన్ని సహాయ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాసిరకం విత్తనాలతో రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఎల్లో మీడియా అసత్యపు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురద చల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దెబ్బతిన్న పంట కొనుగోలు**

అకాల వర్షాలకు దెబ్బతిన్న ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, రైతన్నలు దిగాలు పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను నమ్మవద్దని పేర్కొన్నారు. రైతుల ముసుగులో పెయిడ్ ఆర్టిస్టులతో అమరావతిలో చంద్రబాబు ఆడిన నాటకం తల్లకిందులైందని, రాజధాని ప్రజలు చంద్రబాబును నమ్మే ప్రసక్తే లేదని తెలిపారు. మార్గదర్శి కుంభ కోణంలో చంద్రబాబుకు కూడా వాటాలు అందాయని, అందుకే రామోజీ వెనకేసుకొస్తున్నారని, అమరావతి కుంభకోణంలో చంద్రబాబు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని పేర్కొన్నారు.

## సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర పౌరసంబంధాలశాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24ను మంగళవారం జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సంక్షేమ క్యాలెండర్లను ప్రజా ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు చేరుస్తామన్నారు. జిల్లా పౌరసంబంధాల శాఖ డీడీ పద్మజ, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం గంగ జాతరకు శ్రీకారం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

**కుప్పం:** పట్టణంలోని శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర చాటింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణం, అంకురార్పణం చేపట్టి అమ్మవారి జాతర ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. నూతనంగా నిర్మిస్తున్న అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా జాతరకు ముస్తాబు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అంబలిపోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చాటింపును మంగళవారం అర్ధరాత్రి పట్టణ సరిహద్దుల్లో పూజలు జరిపి చాటింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ నేత మొగిలప్ప మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: గంగవరం పంచాయతీ సర్పంచ్ చంద్రమ్మ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు మొగిలప్ప(69) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ గ్రామానికి చేరుకున్నారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. అంతకుముందు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కూడా మొగిలప్ప మృతదేహానికి నివాలర్పించారు. సర్పంచ్ చంద్రమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇంకా నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు శ్రీరాములురెడ్డి, చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

### మత్తుమందు చల్లి చోరీ

కుప్పం: మున్సిపల్ పరిధిలోని డీకేపల్లెలో సోమవారం రాత్రి ఆర్ఎంపీ గోవిందరాజులుపై గుర్తుతెలియని దుండగులు మత్తుమందు చల్లి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కిటికి తెరచి గోవింద రాజులు నిద్రిస్తున్నారు. గుర్తుతెలియని దుండలు కిటికీల గుండా మత్తు మందును గోవిందరాజులు ముఖంపై మత్తుమందు చల్లి, ఇంట్లోకి చొరబడ్డారు. 96 గ్రాముల బంగారు నగలు, 25 వేల రూపాయల నగదు తస్కరించుకుని వెళ్లారు. మత్తు నుంచి తేరుకున్న గోవిందరాజులు తలుపులు తెరచి ఉండడం, బీరువా తాళాలు పగలు గొట్టి ఉండడం, సామగ్రి చిందర వందరగా పడి ఉండడాన్ని గుర్తించి చోరీ జరిగినట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


బాలాజీని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: గోనుమాకులపల్లె పంచాయతీ సర్పంచ్ జ్యోతి భర్త బాలాజీని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో బాలాజీ చికిత్స పొందుతున్నారు. మంగళవారం పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లి బాలాజీని పరామర్శించి ధైర్యం చెప్పారు.



వేషాల వేడుకకు సర్వం సిద్ధమైంది. తిరుపతి తాతయ్య గుంట గంగజాతరకు చాటింపు ప్రక్రియ పూర్తికావడం.. వారం రోజుల పాటు కుల మతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తేడాలేకుండా, హోదాలను పక్కనబెట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు జాతర వేషాలతో సందడి చేయనున్నారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు వేషాల జోరు కొనసాగనుంది.


పొర్లుదండాలు..వేపాకు చీర(ఫైల్)


వివిధ వేషధారణలో మొక్కు చెల్లిస్తున్న పిల్లలు

# వేషాల వేడుక

- తాతయ్యగుంట గంగమ్మ జాతర చాటింపు ప్రక్రియ పూర్తి
- నేటి నుంచి వారం రోజులు.. వేషాల జోరు
- సందడి చేయనున్న ప్రజాప్రతినిధిలు, అధికారులు
- తొమ్మిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన జాతరగా ప్రసిద్ధి

సాక్షి, తిరుపతి: వేషాలకు పెట్టింది పేరు.. తిరుపతి తాతయ్యగుంట గంగజాతర. తెలంగాణలో బోనాలు, సమ్మక్క, సారక్క, మేడారం జాతర్లలాగానే తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర ఒకటి. కులమతాలు లేకుండా.. కోరికలు నెరవేరిన వారు ప్రత్యేక వేషాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. తిరుమలలో శ్రీవారు స్వయంభువుగా వెలసిన సమయంలోనే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ కొలువైందని చెబుతున్నారు. పల్లవుల కాలంలో గంగమ్మ తల్లికి ఆలయాన్ని నిర్మించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా పిలువబడుతున్న గంగమ్మకు తొమ్మిది వందల ఏళ్ల క్రితం నుంచే జాతర నిర్వహించడం ప్రారంభించారని తెలుస్తోంది. నాడు స్థానిక ఆచారాలతో ప్రారంభించిన ఈ వేడుకను నేడు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం విశేషం. ఆచార సంప్రదాయాలతో అత్యంత వైభంగా నిర్వహించే ఈ జాతర కోసం మంగళవారం చాటింపు నిర్వహించారు.

**వేషాల వెనుక ఉన్న చరిత్ర**

తాతయ్యగుంట గంగజాతర గురించి స్థానికులు ఒక కథ చెబుతుంటారు. తిరుపతిని పాలెగాళ్లు పరిపాలించే కాలంలో, ఒక పాలెగాడు తన రాజ్యంలోని అందమైన యువతులను అత్యాచారం చేసేవాడని, కొత్తగా పెళ్లైన వధువులంతా మొదటి రాత్రి తనతో గడపాలని ఆంక్షలు విధించాడని.. దాంతో, ఆ పాలెగాడిని అంతమొందించి మహిళలను కాపాడేందుకు గంగమ్మ తిరుపతికి రెండు కి.మీ దూరంలోని అవిలాల గ్రామంలో కైకాల కులంలో జన్మించిందని చెబుతున్నారు. యుక్తవయసుకు వచ్చిన గంగమ్మపై కూడా కన్నేయగా ఆమె విశ్వరూపం చూపించిందని, భయంతో పాలెగాడు పారిపోయి దాక్కుంటాడని అంటున్నారు. గంగమ్మ పాలెగాడిని వెతుకుతూ, రకరకాల మారు వేషాలు ధరించి మూడు రోజులపాటు గాలించిందట. మొదటి రోజు బైరాగి వేషం, రెండో రోజు బండ వేషం, మూడో రోజు తోటి వేషాలు వేసినా పాలెగాడు కనిపించకపోవడంతో, నాలుగో రోజు గంగమ్మ దొరవేషం వేయగానే, తన ప్రభువైన దొర వచ్చాడనుకున్న పాలెగాడు బయటకు వచ్చాడట. వెంటనే అతడిని చంపి గంగమ్మ దుష్టశిక్షణ చేసిందని భక్తులు నమ్ముతున్నారు.. గంగమ్మ ఆరోజు చేసిన దుష్టశిక్షణకు గుర్తుగా ఈ రోజుకూ తిరుపతి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ జాతర చేస్తున్నారు.

**కోమటి వేషం**

ఈ వేషాన్ని మిరాశీదారులైన కైకాల, చాకలి వారే వేస్తారు. కైకాల వారు ఆడవేషాన్ని, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు.

**తోటి వేషం**

ఈ వేషంలో భాగంగా కైకాల వారు ఆడవేషాన్ని, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు. చాకలి వారి చేతిలో పొడవాటి కత్తి ఉంటుంది. దీన్ని వేషాలమ్మ పాదాల చెంత ఉంచి పూజిస్తారు. స్త్రీ వేషంలో ఉన్న కైకాల వారి చేతిలో కొత్తగా తయారుచేసిన గంప (బుట్ట), మరో చేతిలో కొత్త చాటను పట్టుకుని భక్తులందరి నెత్తిన చాటతో మెల్లగా కొడుతూ ముందుకు వెళ్తారు. తోటి వేషంలో ఉపయోగించే గంప, చాట, రెండు శేషవస్త్రాలు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తిరుపతి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుస్తారు. శ్రీవారు తన చెల్లె గంగమ్మకు వీటిని ఆయుధాలుగా పంపిస్తారని చెప్పుకుంటారు.

**దొరవేషం**

అనువంశికంగా కైకాల, చాకలి వారు వేసే వేషం. ఇందులో ఆడవేషం ఉండదు. కైకాల వారు దొరవేషాన్ని, చాకలి వారు మంత్రి వేషాన్ని వేస్తారు. పక్కనే తొటివారు పాలెగాడి వేషాన్ని వేస్తారు. ఇంకా మాతంగి, సున్నపుకుండల వేషం, పేరంటాలు, సతారాం, సుంకరి కొండడి వేషం, జల్లి కొండమనాయని వేషం, ధాష్టీక పంతులు, నూగోజీ పంతులు, నడివీధి వేషాలు, పులివేషం, పోటువేషం, నక్కలోళ్ల వేషం, పౌరాణిక, చారిత్రక వేషాలతో గెరిగాట, కీలు గుర్రాలాట, నెమలి ఆట, ఎలుంగొడ్డు ఆట, బొట్టబొమ్మలాట, మెరిగాళ్లాట, గడికొయ్యాట, పాటు వినోదాలు, తోలుబొమ్మలాట, బుర్రకథలు, హరికథలు, గుడుగుమోటారు, దొమ్మరాటలు, రంగల రాట్నాలు, శూలాలు, నిమ్మ పండ్లు గుచ్చుకోవటం, కొబ్బరి కాయలు కొట్టుకోవటం, అడుగడుగు, పొర్లు దండాలు, వేపచీరలు కట్టుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీ.

**అమ్మవారికి నైవేద్యాలు ఇలా..**

జంతుబలిపై నిషేధం ఉన్నప్పటికీ ఆలయంలో ఓ మూలన మేకలు, కోళ్లు కోస్తారు. 'ఇది నార్త్ ఆర్కాట్ జిల్లాగా ఉన్నప్పుడు వేలాది మేకపోతులు, కోళ్లను గంగమ్మకు బలి ఇచ్చేవారని డిస్ట్రిక్ట్ మాన్యువల్లో బ్రిటిష్ వాళ్ళు పొందుపరిచారు. స్త్రీలు ఆలయంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. చాటింపు చేసినప్పటి నుంచి ఐదు వారాల పాటు అమ్మవారికి స్థానికులు అంబలి సమర్పించి పూజలు నిర్వహిస్తారు. కొందరు మహిళలు తమ ఇంటి నుంచి ఆలయానికి మోకాళ్లపై వచ్చి మొక్కులు చెల్లించుకోవటం గమనార్హం.



**బైరాగి వేషం**

దీన్ని చాటు వేషం అని కూడా పిలుస్తారు. బైరాగి వేషంతోనే జాతర ప్రారంభమవుతుంది. ఈ వేషాన్ని ఆలయం తరుపు వారు (మిరాశీదారులు) వేస్తారు. వంశపారంపర్యంగా ఈ వేషాన్ని చాకలి సామాజిక వర్గం వేయడం ఆనవాయితీ. ఒళ్లంతా బూడిద లేదా గంధం పూసుకుని, తలపాగా.. కీపాస్ పంచెకట్టుకుంటారు. నడుముకు ఎర్రని దట్టీని చుట్టుకుని మెడలో పూలహారం, చేతిలో గొడుగు ఉంటుంది.

**బండ వేషం**

ఇది కూడా అదేరోజు మధ్యాహ్నం నుంచి వేస్తారు. కైకాల వారు బండోళ్ల చిన్నది (స్త్రీ) వేషం, చాకలి వారు మగవేషం వేస్తారు. ఈ వేషంలో ఉన్న వారు పాటపాడుకుంటూ ముందుకు సాగుతారు.

**గొల్లవేషం**

దీన్నే మందడి వేషం అంటారు. ఆడవేషాన్ని కైకాల వారు, మగవేషాన్ని చాకలి వారు వేస్తారు. ఆడవేషంలో ఉన్న వారిని గంగమ్మ అంటారు.

**గారడి వేషం**

దీన్నే పాములోళ్ల వేషం అని కూడా అంటారు. అనువంశికంగా కైకాల వారు, రెడ్లు, చాకలి వారు ఈ వేషాన్ని వేస్తారు. కైకాల వారు ఆడవేషం, చాకలి వారు మగవేషం వేస్తారు. వీరు ఊరేగింపుగా వస్తూ నివాసాల ముందు ఆగితే ప్రజలు పూజలు చేస్తారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ధనంజయ మండడి (ఫైల్)

యాదమరి:మండల పరిధిలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కుక్కలపల్లె బస్‌స్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఎస్ఐ సుమన్ కథనం మేరకు.. చిత్తూరు పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన ధనంజయ మండడి(54) వ్యక్తి గత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. కుక్కలపల్లె బస్‌స్టాప్ వద్ద రోడ్డును దాటుతుండగా బెంగుళూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు ఢీ కొంది. ఈఘటనలో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కడుపు నొప్పి తాళలేక కూలీ ఆత్మహత్య


ఉదయ్‌చంద్రన్ మృతదేహం

బంగారుపాళెం: కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందు మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. వివరాలు ఇలా.. బంగారుపాళెం దళితవాడ చెందిన కూలీ ఉదయ్‌చంద్రన్(57) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితంలేక పోయింది. సోమవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమనించి బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమంగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

### మామిడి తోటలపై ఏనుగుల దాడి

పాకాల: మండలంలోని పుల్లావాండ్లపల్లి చుట్టు పక్కల ఉన్న మామిడి తోటలపై రెండు రోజులుగా ఏనుగులు దాడులు చేస్తున్నట్టు స్థానిక రైతులు వాపోతున్నారు. మంగళవారం పలువురు రైతులు మాట్లాడుతూ రాత్రి పూట కాకర్లవారిపల్లి చుట్టు పక్కల మామిడి తోటల్లో ఏనుగులు సంచరిస్తూ మామిడి పంటను నాశనం చేస్తున్నాయని వాపోయారు.

### ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు


క్షతగాత్రుడు సుబ్రమణ్యం

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రం రోడ్డు వద్ద ఆగి ఉన్న మాక్సిక్యాబ్‌ను ఢీకొని స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి కథనం మేరకు.. ఎగువ మారేడుపల్లె హరిజనవాడకు చెందిన ఎస్.సుబ్రమణ్యం(36) ద్విచక్ర వాహనంలో పుణ్యసముద్రం వెళుతున్నాడు. మార్గమధ్యంలో కాణిపాకం రోడ్డులో పుణ్యసముద్రం రోడ్డు వద్ద ఆగి ఉన్న మాక్సికాబ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాక్సీక్యాబ్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆపి ఉండడం వల్లనే ప్రమాదం జరిగిందని బాధితుడు భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మాక్సికాబ్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### నేడు శ్రీవారిని దర్శించుకోనున్న తమిళనాడు సీజే

తిరుమల: తిరుమల శ్రీవారిని తమిళనాడు హైకోర్టు చీఫ్ జస్టిస్ టి.రాజ బుధవారం దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు.



- ఇటీవల చిత్తూరు నగరం ఇరువారానికి చెందిన ఓ డీకేటీ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇద్దరు డ్యాకుమెంట్‌రైటర్లు అడ్డదారులు తొక్కారు. తప్పుడు పత్రాలు సృష్టించడంతో పాటు రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేశారు. ఈ బండారంపై రిజిస్ట్రార్ కార్యాలయంలో అనుమానం రావడంతో పరిశీలన కోసం తహసీల్దార్‌కు పంపారు. ఫోర్జరీ అని గుర్తించిన ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఒక మహిళ, ఇద్దరు డాక్యుమెంట్‌రైటర్లపై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చూపించారు.
- గతంలో చిత్తూరులోని కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను యజమానులకే తెలియకుండా డాక్యుమెంట్‌రైట్లు, ముగ్గురు వీఆర్ఓలు, ఓ తహసీల్దార్..ఇలా పలువురు కలిసి భూ దందాకు పాల్పడ్డారు. తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా భూములను కోట్లాది రూపాయలకు అమ్మేశారు. ఇలా వచ్చిన కోట్లాది రూపాయలను ఈ గ్యాంగ్ మొత్తం వాటాలు పంచుకున్నాయి. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ముఠా గుట్టును రట్టు చేశారు. భూదందాకు పాల్పడిన వారందరిని అరెస్ట్ చేశారు.
- రెండు నెలల కిందట ప్రశాంత్ నగరలోని ఓ భూమికి సంబంధించి 2018లో పట్టా ఇచ్చినట్లు ధృవీకరించారు. ఆపట్టాలో సంతకాలన్నీ తేడాగా కనిపించాయి. తహసీల్దార్ ఆ పత్రాన్ని విచారణకు ఆదేశించగా నకిలీదిగా తేలింది. ఇలాంటివి చిత్తూరులో చాలానే జరుగుతున్నాయి. మరింత మంది ఫిర్యాదుచేస్తే..బోగస్‌పట్టాలు బయటపడే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

చిత్తూరులో భూ మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులను టార్గెట్ చేస్తూ..భూ దందాలకు పాల్పడుతున్నారు. ఈ దందాలో ప్రైవేటు సైన్యానిదే హవా సాగుతోంది. గతంలో ఈ దందాలకు చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం కేరాఫ్ అడ్రాస్‌గా నిలిచింది. ప్రస్తుతం అక్కడ ఆ ఆటలు సాగకపోవడంతో డ్యూప్లికేటుగాళ్లు కొత్త విధానానికి తెర తీశారు. వేలూరు కేంద్రంగా చేసుకుని రెవెన్యూ అధికారుల రబ్బరు స్టాంపులను తయారీ చేయించుకుని భూ దందాకు పాల్పడుతున్నారు. ఏకంగా రెవెన్యూ అడంగల్, పాత రికార్డులలో నంబర్లను మార్చేస్తూ మోసాలకు తెగపడుతున్నారు.




# చిత్తూరులో భూ మాయగాళ్లు

- ప్రైవేటు సైన్యానిదే హవా
- వేలూరు కేంద్రంగా నకిలీ రబ్బరు స్టాంపుల తయారీ
- అడంగల్, పాత రికార్డులలో నంబర్ల మార్పు
- పాతం నేర్పని డ్యాకుమెంట్ రైటర్లు

చిత్తూరు అర్బన్/చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు రూ. కోట్లు పలుకుతున్నాయి. కుటుంబ వివాదాలు ఉన్నవాటికి, డీకేటీ, గ్రామ కంఠం, భాగ పరిష్కారం కానీ భూములను మోక్షం కల్పిస్తామని చెప్పి నమ్మించి కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఏకంగా వాటికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అలాగే కొన్నేళ్లుగా ఖాళీ ఉన్న స్థలాలను, అమయాకులు భూములను భూ హక్కుదారులకు తెలియకుండా..తప్పుడు పత్రాలు సృష్టించి తక్కువ ధరకు ఇప్పిస్తామని రూ. కోట్లల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏకంగా రెవెన్యూ అడంగల్, పాత రికార్డులలో కూడా మార్చేస్తూ....మోసాలకు తెగపడుతున్నారు. ఇలాంటి కేసులు చిత్తూరులో కోకొల్లులుగా ఉన్నాయి.

**ఈ గ్యాంగ్‌లో ఎవరెవ్వరంటే...**

చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొందరు ప్రైవేటు వ్యక్తులు అడపదడప కనిపిస్తుంటారు. పాత పరిచయాలు, పలుకుబడి ఉపయోగించి కొందరు కింది స్థాయి సిబ్బందితో చేతులు కలుపుతుంటారు. ఇలా మొదలైన పరిచయంతో ఎక్కడెక్కడ భూములు ఉన్నాయి... అది డీకేటీనా.. సెటిల్‌మెంటా...ఆ భూములు ఎవరిది.....ఆ భూమికి అడ్డుపడేవారు ఉన్నారా... ఉంటే వారు ఎక్కడ ఉంటారు. వారి పుట్టు పూర్వోత్తరాలను ఆరా తీస్తుంటారు. ఇలా సేకరించిన వివరాలను రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న గోల్‌మాల్ చేసే గ్యాంగ్ లీడర్లకు చేరవేస్తారు. అక్కడ అధికారులతో ముందుగానే ఈవిషయాన్ని చెప్పి బేరసాలు చేస్తారు. డీల్ కుదిరిదే రెచ్చిపోతారు. వారికి పరిచయం ఉన్న రెవెన్యూ సిబ్బంది ద్వారా కాసులు ముట్టజెప్పి పత్రాలను తారుమారు చేస్తారు. ఇలా చేసిన వాటిని అమాయక భూ కొనుగోలుదారులకు కట్టబెడుతారు. ఇదంతా తహసీల్దార్, వీఆర్ఓలు పట్టుబడే వరకు జరుగుతున్న దందాలు. ఇప్పుడు కొత్తగా బోగస్ రబ్బరు స్టాంపులు తయారు చేయించుకుని రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించే పనికి పదును పెట్టారు. ఈ దందాలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డ్యాకుమెంట్‌రైటర్లుగా పెత్తనం చలాయిస్తున్న కొందరు కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే ఓ రిజిస్ట్రార్ తో ఈరకమైన దందా బయటపడింది. మరిన్ని పట్టుబడాల్సి ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**తహసీల్దార్ సీళ్లు ఎత్తుకెళ్లారు...**

2019 వరకు ఒక తహసీల్దార్ చిత్తూరులో పనిచేశారు. ఈ సమయంలో తహసీల్దార్ సీళ్లు విరిగిపోయాయి. అలా వదిలేసిన ఆ సీళ్లు ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఎత్తికెళ్లిపోయారు. అప్పటి నుంచి కూడా ఆ సీళ్లు వారి చేతిలోనే చక్రం తిప్పుతున్నాయి. ఆ సీళ్లతో అప్పటి నుంచి తప్పుడు డీకేటీ పట్టాలు చేయిస్తున్నారు. వీటిలో సంతకాలు తారుమారుగా కనిపిస్తున్నాయి. ఆ పత్రాలను పరిశీలించిన ప్రస్తుత రెవెన్యూ సిబ్బంది, అధికారులు అప్పటి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే మరో తహసీల్దార్ సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు తయారు చేయిస్తున్నారని తెలుసుకున్నారు. ఇదంతా కూడా ప్రశాంత్‌నగర్, గిరింపేటలోని ఓ గదిలో తయారు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**అనుమానం వస్తే..కేసులు పెడుతాం..**



భూ సంబంధిత విషయాలపై చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. పట్టామార్పు, ఇతరాత్ర పత్రాల పరిశీలనను పక్కాగా చూస్తున్నాం. గతంలో జరిగిన అనుభవాల దృష్ట్యా అప్రమత్తంగా ఉన్నాం. తప్పుడు పత్రాలని తేలితే కేసులు నమోదు చేయిస్తాం. కేటుగాళ్ల నుంచి ప్రజలు మోసపోవద్దు.

-కిరణ్, తహసీల్దార్

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**



భూ మోసాల్లో ఇటీవలే తహసీల్దార్, వీఆర్ఓ, ఓ సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్ట్ చేశాం. మళ్లీ ఈ తరహా మోసాలు వెలుగు చూస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దళారులను నమ్మి మోసపోకండి. అలాంటి వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయండి. పత్రాలు మార్పు చేశారని తెలిస్తే..నేరుగా తహసీల్దార్‌ను కలవండి. పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- రిశాంత్‌రెడ్డి, జిల్లా ఎస్పీ